క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ లీకేజీ



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని 6 వార్డు తెలుగువాడలో నాలుగు నెలల నుంచి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అయి, నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిన నీరు మళ్లీ పైప్‌లైన్‌లోకి చేరి కలుషితమై, అదే నీరు కొళాయిల ద్వారా సరఫరా అవుతోందని వాపోతున్నారు. లీకేజీలను అధికారులకు చూపించినా పట్టించుకోవడం లేదని, కలిషిత నీటి వలన దురద, జ్వరాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ సరి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



మదనాపురం: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి భరోసా కల్పించారు. గురువారం మండలంలోని రామన్‌పాడ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తల్లి లక్ష్మీదేవమ్మ మరణించడంతో బాధిత కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన గిరన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. నెలివిడిలో లిఫ్ట్ చైర్మన్ బాల్‌రాం తండ్రి చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



అమరచింత: ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని శివాజీనగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహా కమిటీ సభ్యులు ఆయన చత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శివాజీ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో దేవర్ల సురేష్, దామోదర్, తిరుమలేష్, పోతు రాము, నాగేష్, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, రిక్షా రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఒకేషనల్ పరీక్ష



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రంలో గురువారం జరిగిన ఒకేషనల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ అజీమ్‌పాష, డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. మొత్తం 80 మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ: కేసు నమోదు



గోపాల్‌పేట: ఫర్టిలైజర్ షాపులో చోరీ జరగగా.. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రేవల్లి ఎస్ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండల కేంద్రానికి చెందిన కొండూరు బాలీశ్వర్ మండల కేంద్రంలోనే ఫర్టిలైజర్ షాపు కొనసాగిస్తున్నారు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే షాపుకు తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం షాపు తెరిచేందుకు చూడగా.. అప్పటికే తాళం ఊడిపోయి కనిపించాయి. షాపులోకి వెళ్లగా డెస్క్‌లో ఉన్న రూ.పది వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినుల క్షేత్ర పర్యటన

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారులోని వ్యవసాయ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను గురువారం అధ్యాపకురాలు జయశ్రీ క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి వరిసాగు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ వరి పంటలో కాండం మొదలు వచ్చే సమస్యలపై అవగాహన కల్పించామన్నారు.



జోరుగా ఫిల్టర్ ఇసుక దందా

- మామిడిమాడలో శివారులో డంపులు
- డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సరఫరా
- పట్టించుకోని అధికారులు



ఫిల్టర్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



మామిడిమాడ నేరెడు చెరువు రిజర్వాయర్‌లో ట్రాక్టర్‌లో ఫిల్టర్ ఇసుక తయారీ

ఖిల్లాఘనపురం: మండలం మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. కొంతకాలంగా రాత్రివేళల్లో ఫిల్టర్ ఇసుక తయారు చేసి దొంగతనంగా పలు గ్రామాల్లో విక్రయిస్తున్నారనే ప్రచారం జరిగింది. కానీ గురువారం ఏకంగా పట్టపగలే ఫిల్టర్ ఇసుక తయారు చేస్తూ దర్జాగా అమ్ముకుంటున్నారు. ఇది చూసిన ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల కోసం నిజాయితీగా వాగుల నుంచి ఒక్క ట్రిప్పు ఇసుక తెచ్చుకుందామనుకున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలంటున్నారు. కానీ మామిడిమాడలో ఏకంగా పట్టపగలే ఫిల్టర్ ఇసుక తయారు చేసి అమ్ముకుంటుంటే ఏ అధికారి పట్టించుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నేరెడు చెరువు రిజర్వాయర్‌లో..

మండలంలోని మామిడిమాడ గ్రామంలో కొందరు వ్యక్తులు నేరెడు చెరువు రిజర్వాయర్‌లో మట్టిని ట్రాక్టర్లకు నింపుకొని అక్కడే ఉన్న వెంకట్‌రెడ్డి గుంటుబావి వద్ద మోటార్ల సహాయంతో ఫిల్టర్ చేస్తున్నారు. ఇదే ఇసుకను గ్రామంలో అవసరమున్న వారికి సరఫరా చేయడంతో పాటుగా గ్రామంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. అయినా పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు కనీసం ఇటువైపు చూడకపోవడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణం చేయకూడదు

మామిడిమాడలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ఫిల్టర్ ఇసుక ఉపయోగించడం సరి కాదు. ఇటీవల డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించలేదు. శుక్రవారం వెళ్లి పరిశీలించి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటాం. ఫిల్టర్ ఇసుక మట్టి లాగా ఉంటుంది. కాబట్టి ఆ ఇసుకతో ఇళ్ల నిర్మాణం చేపడితే త్వరగా కూలిపోతాయి.

– రమేష్‌నాయుడు, పీఆర్ ఏఈ, ఖిల్లాఘనపురం

కఠిన చర్యలు తీసుకుంటాం

మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అలాంటి పనులు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పనులకైనా అనుమతులు లేకుండా ఇసుక తరలించిన, ఫిల్టర్ ఇసుక తయారు చేసిన చర్యలు తప్పవు.

– సురేష్‌గౌడ్, ఎస్ఐ, ఖిల్లాఘనపురం

విచారణ చేస్తాం



మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. శుక్రవారం ఆర్ఐతో గ్రామంలో విచారణ చేయిస్తాం. ఎవరైనా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నట్లు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– సుగుణ, తహసీల్దార్, ఖిల్లాఘనపురం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు తిరుమల్‌యాదవ్, కిరణ్‌సాగర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాలరాజుసాగర్‌కు రూ. 55 వేలు, చిన్న రాం చంద్రయ్యకు మంజూరయిన రూ.45 వేల చెక్కును వారికి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, రవికుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కురుమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

చిన్నంబావి: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన మండలంలోని లక్ష్మీపల్లిలో బాధితులకు మాజీ జెడ్పీటీసీ కృష్ణప్రసాద్‌యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామానికి చెందిన చెనమోని రమేష్ రూ.65వేలు, బొల్లు మల్లమ్మ రూ.45వేలు, బండారి శ్యాంసుందర్ రూ.25వేలు, పెద్దస్వాములు రూ.15వేలు సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేష్, భాస్కర్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

వీపనగండ్ల: సెంటర్ ఫర్ ట్రేడ్ యూనియన్ మండల కమిటీని గురువారం మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా బొల్లారం గ్రామానికి చెందిన బాలగౌడ్‌ను ఎన్నుకోగా.. కమిటీ సభ్యులుగా ఆశన్న, బాలకృష్ణాచారి, రంగస్వామి, సుగుణబాయి, రామన్‌గౌడ్, సువర్ణ, రాధ, రాణి, దర్గయ్య, ఆంజనేయులు, శ్రీను, విజయ్, ఈశ్వరయ్య, మధు, నీరజ ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలంలో కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ కన్వీనర్ బాలగౌడ్ అన్నారు.

మహిళలపై దాడులు చేస్తే కఠినంగా శిక్షించాలి



రేమద్దులలో నిందితుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాన్‌గల్: మహిళలపై లైంగిక దాడులు చేసే వారిని కఠినంగా శిక్షిస్తూ.. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రేమద్దులలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఫ్రెండ్స్ యూత్, ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిందితుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ దోషులను కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు శివ, పరమేష్, గిరిబాబు, శివ, గణేష్, సాయి, నందకిశోర్, రిటైర్డు ఆర్మీ జవాన్ నందకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్, జిల్లానాయకుడు మోష డిమాండ్ చేశారు. గురువారం అర్హులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎంపీడీఓ శ్రీపాద్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు కొత్త పెన్షన్లను ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందించనుందని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. మండలంలోని అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్, ఆదాయం, కుల ధృవీకరణ, పత్రాలతో కూడిన దరఖాస్తులను నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు సైతం పత్రాలను ఇక్కడ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన పూజలు



ఆత్మకూర్‌లో హోమం, ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం ప్రముఖ వేదపండితుడు శివసుబ్రమణ్యం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హోమం, ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజలు, మహాన్యాస, పూర్వక, ఏకాదశి రుద్రాభిషేకం, అర్చనలు, మహాగణపతి హోమం, ప్రధానదేవత హోమం, అవాహిత దేవత హోమాలు, మన్యూసూక్త హోమం, లఘు పూర్ణాహుతి, మధ్యాహ్న పూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ, రాత్రి ప్రదోశకాల పూజలు, మూలమంత్ర జపం, మహాన్నపానం, ప్రసాధివాసం, ధాన్యాధివాసం, తదితర పూజలు చేశారు. శుక్రవారం పంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత, రమాసత్యనారాయణ స్వామి, శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు వేలాదిగా పాల్గొనాలని నిర్వాహకులు బాలీశ్వర్‌శెట్టి, తాండూర్ మోహిని, సహదేవుడు, రమేష్‌శెట్టి, యాదగిరిశెట్టి కోరారు.

ఘనంగా ధ్వజారోహణం

వనపర్తి రూరల్: పెద్దగూడెంలోని కోదండ రామస్వామి ఆలయంలో గురువారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కోదండ రామస్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు రమణశర్మ శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. ధ్వజస్తంభంపై గరుడ పతాకం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. రాత్రికి భేరి పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ మార్మోగింది. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ గ్రామంలో కుర్వల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో నూతన విగ్రహాలు, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపనోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని పూలమాలలతో అలంకరించి, ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించినట్లు కుల పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేంద్రం, సకినాబీరయ్య, కృష్ణయ్య, నాగరాములు, పెద్దలు పాల్గొన్నారు.

రూ. 50వేల విరాళం

బీరప్ప ఆలయానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రాముయాదవ్ రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.



జమ్మాపూర్‌లో ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న కుల పెద్దలు, గ్రామస్తులు



పెద్దగూడెం ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నిజాయితీ చాటుకున్న రజకుడు



డబ్బులు బాధితుడికి అందిస్తున్న చాకలి బాబు

అమరచింత: పట్టణానికి చెందిన చాకలి ఇస్త్రీ బాబు తన లాండ్రీ షాపునకు ఇస్త్రీ కోసం వచ్చిన ప్యాంట్ జేబులో రూ.28 వేల నగదు ఉండటంతో సదరు వ్యక్తికి నగదును అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు.. పట్టణానికి చెందిన ఇస్త్రీ బాబు లాండ్రీ షాపునకు ఇదే పట్టణానికి చెందిన బావండ్ల గోపి గురువారం రెండు జతల బట్టలను ఇస్త్రీ కోసం ఇచ్చి వెళ్లాడు. ప్యాంటును ఇస్త్రీ చేస్తున్న సమయంలో జేబులో డబ్బులు కనిపించడంతో వాటిని బయటకు తీసి చూడగా.. రూ.28 వేలు కనిపించాయి. బావండ్ల గోపిని పిలిపించి తన జేబులో దొరికిన డబ్బులను అప్పగించాడు. దీంతో ఇస్త్రీ బాబు నిజాయితీని కాలనీవాసులు తాటికొండ రమేష్, సత్యనారాయణ, గోపాల్ అభినందించారు.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'



పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు

పాన్‌గల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కుమార్ అన్నారు. గురువారం హెచ్‌సీయూ భూములను కాపాడాలని కోరుతూ చలో సెక్రెటరియేట్ ముట్టడికి ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రశించే గొంతులను నొక్కడం సరైంది కాదన్నారు. చట్టబద్ధంగానే శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాలను నిలిపివేసే వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, ఉదయ్, మహేష్, సాయి ఉన్నారు.

రెండో మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: నారాయణ పేట జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 5న జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు కోరారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో గురువారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించిన ఫలితంగా డిసెంబర్‌లో రూ.139 కోట్లు విడుదల చేయగా.. ఇంకా రెండు, మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో మిగిలిపోయాయన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సురేష్, కురుమన్న, వెంకటయ్య, రామచంద్రి, హనుమంతు, వెంకటన్న పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

చిన్నంబావి: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కొత్త కళ్యాణ్‌రావు అన్నారు. ఆయన మండలంలోని గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన జీపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికి తీయాలనే ఉద్దేశంతో క్రీడలకు ప్రోత్సాహకం అందిస్తున్నానని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో సైతం నైపుణ్యం సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, గూడెం సుధాకర్, మక్బూల్, గాలన్న, పురేందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కొత్తకోట రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొనగా ఫైనల్లో తలపడిన కొత్తకోట మదీననగర్ జట్టు విజేతగా నిలవగా.. బుల్లెట్11 జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు వామన్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుంత మౌనిక, ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్, అయ్యన్న, ఖాజా, వసీంఖాన్, తాహేర్, వహీద్‌అలీ, బాబా, లాలు, సాజిద్‌అలీ, చాంద్, ఖదీర్‌ఖాన్, కైసర్, అజ్జు, షఫి, ఖదీర్, అజ్జకొల్లు నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.



గూడెం గ్రామంలో..

మహనీయుల పోరాటాలు స్ఫూర్తిదాయకం

వనపర్తిటౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్, తెలంగాణ భగత్‌సింగ్ కొమురయ్య పోరాటాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శివాజీ మహారాజ్ 345వ వర్ధంతి, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్, దొడ్డి కొమురయ్య లాంటి మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాలేమియా, ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నయ్య, దళిత నాయకుడు యోసేపు, ఉద్యోగ సంఘ నాయకుడు సిలిగిరి వెంకటేష్, ఎస్ఎస్‌పీ ఉద్యోగులు గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టులా..

కొత్తకోట రూరల్: హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ, రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులను కొత్తకోట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను విద్యార్థులకు ప్రయోగశాలలుగా మార్చాల్సింది పోయి కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములపై డేగ కన్ను వేసిందని ఆరోపించారు. హెచ్‌సీయూలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరదాగా విద్యార్థులతో ఆడుకోవడానికి వచ్చి అక్కడ ఉన్న భూములను చూసి అభివృద్ధి పేరు మీద అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి సిద్ధపడ్డారని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ పర్యావరణపరంగా, వన్య ప్రాణులకు సంరక్షణ కేంద్రంగా ఉంటుందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్, విద్యా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సామరస్యంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై లాఠీలు ఝళిపించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. అరెస్టయిన వారిలో ఏబీవీపీ నాయకులు కార్తీక్, చింటు, బన్నీ, దస్తగిరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

ఆత్మకూర్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం అందిస్తున్న ఘనట సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమని నాయకులు అన్నారు. గురువారం మండలంలోని పిన్నంచర్ల రేషన్ షాపులో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలను విస్మరించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, మచ్చేందర్‌గౌడ్, వెంకటేష్, విజయలక్ష్మి, రాములు, విష్ణు, జగన్, రామదర్శన్, తిరుపతి, అశోక్‌గౌడ్, రాజు, మోహన్, హరీష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వాకిటి పర్యటన

మండలంలోని గ్రామాల్లో నిర్వహించే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పాల్గొంటారని నాయకులు రహ్మతుల్లా, పరమేష్ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని, స్థానిక రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.